
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 కనిష్ఠం 26.3





మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

భూభారతి దరఖాస్తులపై సమగ్ర విచారణ జరపాలి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఆర్మూర్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. శుక్రవారం ఆర్మూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశమైన కలెక్టర్ భూభారతి దరఖాస్తుల పరిశీలిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టం కింద రైతులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు ప్రాతిపదికన మెండోర మండలంలోని 8 గ్రామాలలో నిర్వహించిన రైతు సదస్సుల సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం మార్గదర్శకాలను పాటిస్తూ నూతన ఆర్వోఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. మెండోర మండలంలోని 8 గ్రామాలలో నిర్వహించిన సదస్సులలో 706 దరఖాస్తులు వచ్చాయని, వీటిని క్షుణంగా పరిశీలించాలని పకడ్బందీగా క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలని చెప్పారు. మొక్కుబడిగా కాకుండా ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా సమగ్రంగా పరిశీలించాలన్నారు. భూభారతిలోని నిబంధనలపై పూర్తిఅవగాహన కలిగి ఉన్నప్పుడే లోటుపాట్లకు తావులేకుండా దరఖాస్తుల పరిశీలన విచారణ ప్రక్రియాలను నిర్వహిచగల్గుతారన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా భూభారతి దరఖాస్తు విచారణలో పూర్తిపారదర్శకంగా వ్యవహరించి భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈనెల 20లోపు దరఖాస్తుల విచారణ పూర్తి కావాలన్నారు. సమావేశంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్‌లు, ఆర్ఐలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



• ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలపై ఒత్తిడి
• వారి నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలదే హవా
• అభివృద్ధి పనులు, పథకాల అమల్లో సతమతమవుతున్న అధికారులు
• బదిలీల కోసం అధికారుల పైరవీలు

అభివృద్ధి, పథకాల అమలుకు నేతల పట్టు!

నిజామాబాద్,మే9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు నేతలు అభివృద్ధి పనుల అమలుపై పట్టు బిగిస్తున్నారు. అన్నీ తమ కనుసన్నల్లో జరిగేలా చూస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతల హవా పెరుగుతుండటంతో ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు తమ ఆధ్వర్యంలో పనులు ప్రారంభం కావాలని పట్టుబడుతుండగా.. అధికారపార్టీ నేతలు అన్నీ తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. అధికారులు తమ కనుసన్నల్లో పనిచేసే విధంగా పావులు కదుపుతున్నారు. రెండు వైపులా ఒత్తిళ్లు పెరగడంతో అభివృద్ధి పథకాల అమలు అధికారులకు కత్తిమీద సాములాగా మారుతుంది. 'కరువు మంటే కప్పకు కోపం.. వద్దంటే పాముకు కోపం' అన్న తీరులో అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో పథకాల అమలు కొనసాగిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నుంచి సీఎంఆర్ఎఫ్, షాదీముబారక్ చెక్కుల పంపిణీ వరకు ఎవరికి వారే కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఇద్దరి లిస్టులను అధికారులు జిల్లా కలెక్టర్లకు పంపి చేతులు దులుపుకుంటున్నారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రొటోకాల్ పాటించాలని వారు అధికారులను కోరుతున్నారు. కలెక్టర్ల నుంచి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తూ ఎన్నికైన వారికి విలువ ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో లీవ్‌లు పెట్టి వెళ్తున్నారు. మరికొంత మంది ఇతర ప్రాంతాలకు బదిలీ చేసుకుంటున్నారు.

మండల, డివిజన్‌స్థాయి అధికారులపై ఒత్తిడి

ఉమ్మడిజిల్లాలో అధికార పార్టీకి చెందిన వారు నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు నలుగురు ఉన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో ఒత్తిడి ఏమీ లేదు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్న నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, బాల్కొండ, కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో పరిస్థితి కీలకంగా మారింది. ఈ నియోజకవర్గాల పరిధిలో పనిచేసే మండల, డివిజన్‌స్థాయి అధికారులపై ఒత్తిడి బాగా పెరిగింది. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సై, సీఐలు, డివిజన్ లెవల్ అధికారులతో పాటు ఇతర మండల అధికారులపైన ఈ ఒత్తిడి పెరుగుతోంది. ఈ నియోజకవర్గాల పరిధిలో పథకాల అమలులో తమదే పైచేయిగా ఉండాలని ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు.. అన్ని పథకాలు తమ ఆధ్వర్యంలోనే కొనసాగాలని అధికార పార్టీ నేతలు కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నుంచి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ వరకు తమ ఆధ్వర్యంలో చేయాలని కోరుతున్నారు. లబ్ధిదారుల ఎంపికతోపాటు పథకాల అమలుకు తమలిస్టులను పంపిస్తున్నారు. ఇందిరమ్మ కమిటీల ఎంపిక సమయంలోనే ఇబ్బందులు ఏర్పడ్డాయి.

తప్పుతున్న ప్రొటోకాల్

నియోజకవర్గాల్లో జరిగే అభివృద్ధి పనుల విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. తమ నియోజకవర్గాల పరిధిలో తాము ఎన్నికైన అధికార పార్టీకి చెందిన నేతల ద్వారా పనులు చేయిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ విషయాన్ని పలు దఫాలు సమావేశాలు, శాస నసభ సమావేశాల్లో సీఎం దృష్టికి సైతం తీసుకెళ్లారు. తమ నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలు అన్నిట్లో కలగజేసుకోవడంతో పాటు తమకు ప్రాధాన్యత లేకుండా చూస్తున్నారని ప్రొటోకాల్ పాటించేలా విధంగా చూడాలని శాసనసభ స్పీకర్ కూడా విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో పర్యటిస్తూ పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే పనులన్నీ తమ కనుసన్నల్లోనే జరిగేలా అధికార పార్టీ నేతలు కోరుతున్నారు.

క్యాడర్‌కు అనుకూలంగా..

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు అన్నీ తామై వ్యవహరించడంతో పాటు పథకాలు అమలయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. క్యాడర్‌కు అనుకూలంగా ఉంటూనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండువైపులా మండలస్థాయి అధికారులపై ఒత్తిడి పెరుగుతుండటంతో అధికార కార్యక్రమాలు వచ్చాయంటేనే భయపడుతున్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసే కార్యక్రమాలు ఉంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా పిలవడంతోపాటు కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. మండలస్థాయిలో పనిచేసే అన్ని శాఖల అధికారులపై ఒత్తిడి ఎక్కువ కావడంతో కొన్ని మండలాల పరిధిలో అధికారులు లీవ్‌లు పెట్టి వెళ్తున్నారు. తమకు దగ్గరగా ఉన్న వారి ద్వారా పైరవీలు చేసుకుంటూ ఇతర జిల్లాలకు వెళ్తున్నారు. కొంతమంది డిప్యూటేషన్‌పై ఇతర శాఖలకు వెళ్తున్నారు. అన్ని పనుల్లో ఒత్తిళ్లు ఉండటం వల్ల రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, వ్యవసాయ ఇతర శాఖల అధికారులు కొంత ఇబ్బందులు పడుతున్నారు. మిగతా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పనులు కొనసాగుతుండగా ఈ నియోజకవర్గాల పరిధిలో మాత్రం రెండువైపులా ఒత్తిళ్లు ఉండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇద్దరు చేసిన సిఫార్సులను పంపిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి జాబితాను ఎంపిక చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు మండలాల పరిధిలో ఈ పరిస్థితి ఉండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొంతమంది అధికారులు లౌక్యంతో వ్యవహరిస్తూ పనులు చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. బాన్సువాడ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరడంతో అక్కడ పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే వర్గం ఉండటం వల్ల రెండు వర్గాలతో అధికారులు ఇబ్బందులు (తరువాయి 8వ పేజీలో..)



భారత సైన్యానికి మద్దతుగా ఆలయాల్లో పూజలు

...... వివరాలు 7లో



ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

• రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని సుద్దులం తండా గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన జగదాంబమాతా, సత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. దేవాలయాలకు వెళ్తే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ యేడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సుభిక్షంగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బంజార సేవ సంఘం జిల్లా అధ్యక్షులు భద్యానాయక్, నాయకులు కొట్టం మనోహర్, బర్ల మధు, గోపు సాయిలు, తహసీల్దార్ గంగాధర్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ

వర్నీ: వర్ని మండలం జాకోర ఎత్తిపోతల పథకం కోసం శుక్రవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం భూమిపూజ చేశారు. ఎత్తిపోతల పథకం నిర్మాణంతో తొమ్మిది గ్రామాల పరిధిలోని 4470 ఎకరాల వ్యవసాయ సాగుభూమికి నీరు అందుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. పనులను నాణ్యతతో వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్ని సెక్షన్ పరిధిలోని సిద్దాపూర్ లిఫ్ట్‌ఇరిగేషన్ పథకం 33కేవీ సబ్‌స్టేషన్‌కు అవసరమయ్యే విద్యుత్ లైన్ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్, డీఈ మహ్మద్ ముక్తార్, నగేష్ కుమార్, ఏడీఈ రాజశేఖర్, నవీన్, బాల కిషన్, సబ్ ఇంజనీర్‌లు శ్రీరామ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

12న బోధన్‌లో జాబ్‌మేళా

బోధన్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ పాస్‌అయిన విద్యార్థినీ విద్యార్థులకు బోధన్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అప్రెంట్రిషిప్, జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న ఉదయం 10గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుంద పేర్కొన్నారు. ఎలక్ట్రిషియన్, పిట్టర్, మోటార్ మెకానిక్, డిజిల్ మెకానిక్, కోపా‌ట్రేడ్ పాసై విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాబ్‌మేళాకు వరుణ్ మోటార్స్, టాటామోటార్స్, రుద్ర మోటార్స్, బజాజ్‌ఆటో, సుజిత్ టార్ఫ్‌మిల్స్, ప్రీమియం ఎనర్జీస్ వంటి కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వీరత్వానికి నిలువెత్తు రూపం మహారాణాప్రతాప్

సుభాష్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ధైర్యానికి, శౌర్యానికి, దేశభక్తికి నిలువెత్తు రూపం మహారాణా ప్రతాప్ అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని స్థానిక ఎల్లమ్మగుట్ట చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అర్బన్ ఎమ్మెల్యే మహారాణా ప్రతాప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగలుల నియంత పా లనకు వ్యతిరేకంగా పోరాడిన భరతమాత ము ద్దుబిడ్డ మహారాణా ప్రతాప్ అని అన్నారు. దేశం లో పుట్టిన గడ్డిపరక సైతం ఈ దేశ పౌరుషాన్ని దేశభక్తిని పాలుపంచుకుంటుందని అనడానికి మహారాణా ప్రతాప్ గుర్రం చెతక్ దీనికి నిదర్శనమన్నారు. హల్దిఘాటి యుద్ధంలో వీరోచితంగా పోరాడి ప్రాణాపాయస్థితిలో ఉన్న మహారాణా ప్రతాప్‌ను రక్షించడానికి 26అడుగుల కందకంపై నుంచి చెతక్ దూకి రక్షించడమే నిదర్శనమన్నారు. మహారాణప్రతాప్ విదేశీయులకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. శక్తివంతమైన అమెరికాపైన రెండు దశాబ్దాలు సుదర్ఘపోరాటం అనంతరం విజయం సాధించిన వియత్నాం దేశఅధ్యక్షుడు స్వయంగా తమ గెలుపునకు మహారాణా ప్రతాప్ స్ఫూర్తి అని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. వియాత్నం విదేశాంగ శాఖ మంత్రి భారత పర్యటనకు వచ్చినప్పుడు స్వయంగా ఉదయపూర్‌లో రాణప్రతాప్ సమాధిని దర్శించి అక్కడ నుంచి పిడికెడు మట్టిని తీసుకుని ఈ దేశ వీరత్వం, ఇక్కడ ఉన్న వీరుల ప్రేరణ మా దేశానికి కూడా అవసరమని చెప్పి ఆమట్టిని తీసుకెళ్లి వియాత్నం దేశం మట్టిలో కలపడం జరిగిందన్నారు. నేడు జరుగుతున్న భారత్ పాకిస్థాన్ యుద్ధంలో ప్రదాని నరేంద్రమోదీ ఛత్రపతిశివాజీమహారాజ్, రాణాప్రతాప్ లాంటి వీరుల స్ఫూర్తితో పాకిస్థాన్ ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

బోధన్‌లో మహారాణాప్రతాప్ జయంతి వేడుకలు

బోధన్ రూరల్, మే9(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మహారాణా ప్రతాప్ ప్రతాప్ 486వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయి ఆదర్శ యువతి మండలి అధ్యక్షురాలు పద్మసింగ్ మాట్లాడుతూ మహారాణా ప్రతాప్ భారతదేశ చరిత్రలో ఆయన సాహసం, శౌర్యం, త్యాగం, బలిదానం, భావిస్వాతంత్ర పోరాటానికి ప్రత్యేకంగా నిలిచాయని ఆయన సేవలను కొనియాడారు. మాతృభూమి కోసం ప్రాణాలైన ఇవ్వడానికి సైనికులను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. మహారాణా ప్రతాప్ సింగ్ దేశం, ధర్మ సంస్కృతి, స్వాతంత్ర కోసం పోరాడి భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. నేటి యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మదన్ సింగ్, పద్మసింగ్, రాజేందర్ సింగ్, గోపిసింగ్, సంజయ్ సింగ్, విజయ్‌సింగ్, రంజిత్ సింగ్, తదితరులున్నారు.



శ్రీధర్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం

హింసకు తావులేదు

• చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం
• శ్రీధర్ కుటుంబానికి రూ.2.17కోట్ల పరిహారం.. 300 గజాల ప్రభుత్వ స్థలం
• రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
• అధికార లాంఛనాలతో శ్రీధర్ అంత్యక్రియలు
• పాల్గొన్న ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్

మాచారెడ్డి,మే9(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, హింసకు పాల్పడితే ప్రజాస్వామాన్ని విశ్వసించేవారు ఎవరూ అంగీకరించరని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హింసకు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పాల్వంచలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించిన 'కగార్' గ్రేహౌండ్ కానిస్టేబుల్ శ్రీధర్ అంత్యక్రియల్లో (తరువాయి 8వ పేజీలో..)

వసతులు నిల్.. ఫీజులు ఫుల్!

• జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో అడ్డగోలు ఫీజులు • రాష్ట్రస్థాయి ర్యాంకులంటూ మోసగిస్తున్న పలు విద్యాసంస్థలు • ప్రభుత్వ కళాశాలలకు ఆదరణ కరువు!

నిజామాబాద్ అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): వసతులు లేకున్నా ప్రైవేట్ జూనియర్ కళాశాలలు జిల్లాలో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో అడ్మిషన్ పొందాలంటే లక్షల్లో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టల్ వసతితో ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్ పొందాలంటే కనీసం లక్ష రూపాయలు కావాల్సిందే. జేఈఈ, అడ్వాన్స్, మెయిన్స్, ఇతరాత్ర శిక్షణకు అయితే అదనంగా మరో 20 నుంచి 30 వేలు చెల్లించాల్సిందే. ప్రస్తుతం ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం ప్రైవేట్ కళాశాలలు వేయని ఎత్తులు లేవు.. చేయని మంత్రాంగాలు లేవు. అడ్మిషన్ల కోసం తమ కళాశాలల్లో అన్ని వసతులూ ఉన్నాయని, రాష్ట్రస్థాయి ర్యాంకులు తమకే వచ్చాయని ఊదరగొడుతూ ప్రైవేట్ కళాశాలలు అడ్మిషన్లను చేసుకుంటున్నాయి. అమాయకపు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసపూరిత ప్రచారాలతో నమ్మించి అడ్మిషన్లు చేస్తున్నారు. గ్రామీణ స్థాయిలో పీఆర్వోలను నియమించుకుని వారికి అడ్మిషన్‌లలో కమీషన్లు ఇస్తూ, అమాయకపు విద్యార్థులకు వల వేస్తున్నారు. ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ప్రచారం చేస్తూముందుగానే సీట్లను రిజర్వు చేస్తున్నారు. ప్రైవేట్‌కు ధీటుగా అన్ని వసతులూ ఉన్నాయని ఉచితంగా విద్యను అందిస్తామని చెబుతున్నా ప్రభుత్వ కళాశాలలు మాత్రం అడ్మిషన్ల కోసం కనీస ప్రయత్నం కూడా చేయడం లేదు. ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల్లో రోజురోజుకు అడ్మిషన్ల సంఖ్య తగ్గిపోతుండగా ఫలితాలు కూడా అంతంత మాత్రంగానే వస్తున్నాయి. దీంతో విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలవైపే మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ కళాశాలలు యేడాదికేడాది ఫీజులను పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికభారం పెంచుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారులు మాత్రం ప్రైవేట్ కళాశాలలవైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



జిల్లాలో 122 జూనియర్ కళాశాలలు

జిల్లాలో 122 జూనియర్ కళాశాలలు ఉండగా, గత విద్యా సంవత్సరం 15వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఐదు ఒకేషనల్ కళాశాలల్లో 2500మంది అడ్మిషన్లు పొందారు. ఈ సంవత్సరం 22వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతి పాస్ కాగా, జిల్లాలో 15వేల వరకు విద్యార్థులు అడ్మిషన్లు పొందే అవకాశం ఉంది. కేజీబీవీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించారు. జిల్లావ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ ప్రభావం వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్‌లపై పడే అవకాశం ఉంది.

70 శాతం విద్యార్థులు ప్రైవేట్‌కే..

జిల్లాలో ప్రతీ సంవత్సరం 20వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతి పాస్ అవుతుండగా, అందులో రెగ్యులర్ ఇంటర్మీడియెట్ 15వేల మందికి పైగా, ఒకేషనల్‌కు 2500 మంది, పాలిటెక్నిక్, ఇతర కోర్సుల వైపు మిగతా విద్యార్థులు వెళ్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ఇతర గురుకులాలు, రెసిడెన్షియల్ కళాశాలలు 82 ఉండగా, ప్రైవేట్ కళాశాలలు 40 వరకు ఉన్నాయి. పది శాతం వరకు అడ్మిషన్లు హైదరాబాద్ చుట్టుపక్కల కళాశాలల్లో అవుతుండగా 70 శాతానికి పైగా జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో అవుతున్నాయి.

భారీ భవనాలు.. ఇరుకు గదులు

అడ్మిషన్లు ఎడాపెడా తీసుకుంటున్న మెజార్టీ ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో వందల సంఖ్యలో విద్యార్థులను గంటల తరబడి కూర్చోబెడుతున్నారు. లక్షల్లో ఫీజులు వసూలుచేస్తున్న వారు విద్యార్థులకు కనీససౌకర్యాలు కల్పించడాన్ని విస్మరిస్తున్నారు. కనీసం ప్రాక్టికల్స్ నిర్వహణకు సరైన సౌకర్యాలు, మెటీరియల్ ఉండడం లేదు. ఒకేషనల్ కళాశాలలైతే తూతూ మంత్రంగా తరగతులను నిర్వహిస్తూ విద్యాసంవత్సరాన్ని ముగించేస్తున్నాయి. గతేడాది నగరంలో ఏర్పాటైన మూడు కార్పొరేట్‌బ్రాంచ్‌లకు (తరువాయి 8వ పేజీలో..)

కోటగిరిలో ద్విచక్రవాహనం దగ్ధం


దగ్ధమైన ద్విచక్ర వాహనం

కోటగిరి,మే9(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే యువకుడు రోజు మాదిరిగానే ఇంటి ముందు తన హోండా షైన్ ద్విచక్ర వాహనాన్ని నిలిపిఉంచాడు. తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించారు. మంటలు పెద్ద ఎత్తున రావడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూసే సరికి వాహనం పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు ఫిర్యాదు మేరకు కోటగిరి ఎస్ఐ సునీల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కోటగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష పడినట్లు రుద్రూరు ఎస్ఐ సాయన్న తెలిపారు. రుద్రూరు మండలంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్లు రుద్రూరు ఎస్ఐ సాయన్న తెలిపారు. బొప్పాపూర్ గ్రామానికి చెందిన సాయిలు, రాణంపల్లి గ్రామానికి చెందిన వీరేశం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడగా వీరిని బోధన్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి ఇద్దరికి సాయిలుకు అనే వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమాన, వీరేశం అనే వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

సిలిండర్ లీకై సామగ్రి దగ్ధం

నందిపేట్, మే 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం నియో లిటిల్‌ఫ్లవర్ పాఠశాల సమీపంలో ఓ ఇంట్లో సిలిండర్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న గంధం గంగామణి భయంతో బయటకు వచ్చి కేకలుపెట్టడంతో యువకులు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అంటుకోవడం వల్ల ఇంట్లో ఉన్న విలువైన బట్టలు, బెడ్లు, ఇతర సామగ్రి కాలిపోయాయి. స్థానికులు మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్థానిక యువకులు మంటలు ఆర్పేశారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్ , మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ చంద్రిక ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో బీఎస్సీలో (ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బిజడ్సి ఎంబీజడ్సి) , బీకాంలో (సీఏ, బీఏ), బీఏలో (హెచ్‌ఈపీ) కోర్సులలో సీట్లు కలవని , ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులను పదవతరగతి, ఇంటర్ మెమోలు, బోనఫైడ్, కుల, ఆదాయ ధృవపత్రాలతో పాటు ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో పాటు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్‌నెంబర్ 9866586887, 9959631207 లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్ , మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్, రాంపూర్ గ్రామాలలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు ఉమనుసాహేర్, డాక్టర్ కిరణ్‌రెడ్డి పాండే తెలిపారు. పశువులు వ్యాధిబారిన పడకుండా టీకాలు వేయించుకోవాలని వారు కోరారు. వేసవిలో పశువులను నీడపట్టున ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినీత, కళ్యాణి, హైమద్‌పాశా, శ్యామల పాల్గొన్నారు.

'ప్రజా ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం'


మెండోరలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

మెండోర, మే 9(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మరికి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను తొందరలోనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. నాటి పాలకులు పనులు అర్థాంతరంగా ఆపివేసి చేతులు దులుపుకున్నారని, నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడానికి నిలిచిపోయిన పనులను పూర్తిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య, సావెల్ నెల్ల లింగన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ధాన్యం వ్యాపారి

బోధన్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రైతుల ధాన్యం సొమ్ము రూ.4కోట్ల మేర ఎగవేసి పరారైన ఓ వ్యాపారిని నిజామాబాద్ జిల్లా బోధన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకకు చెందిన వ్యాపారి సురేష్ చౌదరి గత సంవత్సరం క్రితం బోధన్‌కు చెందిన పలువురు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత రైతులకు డబ్బులు ఇవ్వకుండా వ్యాపారి పరారయ్యాడు. దీంతో వ్యాపారి కనిపించడం లేదంటూ రైతులు ఇటీవల పోలీసులను ఆశ్రయించారు. తమకు వ్యాపారి సురేష్ చౌదరి రూ. 4కోట్లకు పైగా ధాన్యం డబ్బులు చెల్లించాల్సి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శుక్రవారం కర్ణాటకకు వెళ్లి వ్యాపారిని పట్టుకుని బోధన్‌కు తీసుకొచ్చారు. కాగా.. ఈ సమాచారం అందుకున్న బోధన్, పరిసర గ్రామాల రైతులు శుక్రవారం పెద్ద ఎత్తున బోధన్ రూరల్ పోలీసుస్టేషన్‌కు తరలొచ్చారు. వ్యాపారి వద్ద నుంచి తమకు రావాల్సిన ధాన్యం డబ్బులు ఇప్పించాలని పోలీసులను వేడుకున్నారు.

మద్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మద్నూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్ తెలిపారు. తమ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకై దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.వెంకటేశం (9492795524)ను సంప్రదించాలని అన్నారు.

కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహ పంక్తి భోజనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన సీపీ సాయిచైతన్య


బాల్కొండ పీఎస్‌ను తనిఖీ చేస్తున్న సీపీ సాయిచైతన్య

బాల్కొండ, ముప్కాల్, మే 9(ఆంధ్రజ్యోతి): బాల్కొండ, ముప్కాల్ పోలీస్‌స్టేషన్లను శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో పనితీరును రిసిప్షన్ సెంటర్లు, కంప్యూటర్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. 5ఎస్ విధానం అమలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించేలా చూడాలని అన్నారు. గంజాయి నిర్మూలన చేయాలని ఆదేశాలు జారీచేశామని, గంజాయికి బానిస అయిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. సైబర్ మోసగాళ్ల వలలో పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, గేమింగ్ యాప్‌లపట్ల ప్రజలు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, రజనీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెండోర : ప్రజలతో కలిసి మెలిసి ఉంటేనే పోలీస్ వ్యవస్థకు మచి పేరు వస్తుందని, పోలీ సులు క్రమశిక్షణతో ఉండాలని సీపీ సాయి చైతన్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌ను సీపీ సాయిచైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రైమ్ వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారులతో తగినంత సహాయం చేయాలని రైతులకు ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారులతో మాట్లాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వర్షకాలంలో వర్షాలు ఎక్కువ పడే రోజులలో రైతులకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజలకు రైతులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఎస్సై యాసిర్ అర్పత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి


ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ సత్యనారాయణ

ఆర్మూర్ టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాజారాంనగర్ కాలనీలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని రాత్రివేళలో అనవసరంగా బయట తిరుగరాదని, ట్రాఫిక్ నియమాలను ప్రతీ వాహనదారుడు ఖచ్చితంగా పాటించాలని అన్నారు. ఈవ్‌టీజింగ్, మహిళలను వేదించడం లాంటివి చేస్తే కఠిన శిక్షలకు గురవుతారని, బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఇళ్లను అద్దెకు ఇవ్వాలని వారు ఎలాంటి నేరాలకు పాల్పడిన యజమానులపై కూడా కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏసీపీ ప్రజలకు వివరించారు. సైబర్ నేరాల బారినపడిన వారు తక్షణమే 1930 వివరాలు తెలపాలని సూచించారు. అంతకు ముందు 170 ఇండ్లను తనిఖీలు చేపట్టి సరైనా ధృవ పత్రాలు లేని 75 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, కారును తాత్కాలికంగా స్వాదీ నం చేసుకున్నారు. అలాగే ఫింగర్‌ప్రింట్ పరికరం ద్వారా 35మంది అనుమానితులను గుర్తించి ఇద్దరు రౌడీలను, నలుగురు సస్పెట్ షీట్ వ్యక్తులను తనిఖీలు చేశారు. కార్యక్ర మంలో ప్రొబేషనరీ ఐపీఎస్ సాయికిరాణ్, ఎస్‌హెచ్‌వోలు పి. సత్యనా రాయణ, శ్రీదర్‌రెడ్డి, సత్యనా రాయణ, డివిజన్ లోని 9 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, స్పెషల్‌పార్టీ, రిజర్వ్‌సిబ్బంది పాల్గొన్నారు.

'పంటలపై రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి'

జక్రాన్‌పల్లి , మే 9 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి మోతాదులోనే వినియోగించాలని కీటక శాస్త్రవేత్త ఎం.సాయిచరణ్ అన్నారు. శుక్రవారం ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయశాఖ సమన్వయంతో జక్రాన్‌పల్లిలోని రైతువేదిక భవనంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనంతరం ఆయన జరిగిన సమావేశంలో శాస్త్రవేత్త ఎం.సాయిచరణ్ మాట్లాడుతూ పంటల సాగులో రైతులు యూరియా సిఫరాసు చేసిన మోతాదులోనే వినియోగించాని ఎక్కువ వాడకం వేయడం వల్ల పంట రసం పీల్చే పరుగులు, ఇతర వ్యాధులకు గురవుతుందని సూచించారు. అనంతరం రుద్రూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ప్రశాంతి మాట్లాడుతూ ప్రతీయేటా ఒకేరకమైన పంట సాగుచేయకుండా పంట మార్పిడి చేసుకొని సాగుచేయాలన్నారు.

అనంతరం జయశంకర్ విశ్వవిద్యాలయం ఆర్‌ఈఏసీ సభ్యుడు కోటపాటి నర్సింహనాయుడు మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువులు తగ్గించాలని సేంద్రీయ ఎరువులు వాడడం వల్ల పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవాల సంఖ్య పెరిగి నేలలో కర్బన శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, ఫార్మర్ ప్రొడ్యుసర్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఏఈవోలు శ్రీకాంత్, శివప్రసాద్, శంకర్, సుభస్య, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● డీపీవో శ్రీనివాస్‌రావు


వేల్పూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌రావు

వేల్పూర్ , మే 9(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో తీవ్రమైన ఎండలు ఉన్నందున గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తపడాలని డీపీవో శ్రీనివాస్‌రావు కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం లక్కోర, వేల్పూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం పనులపై ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. డ్రైనేజీల నుండి పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తు మురికి నీరు నిల్వకుండకుండా చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కలను ఎండిపోకుండా ప్రతీరోజు రెండుసార్లు తగిన మోతాదులో నీరందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సాయిలు, గ్రామ కార్యదర్శులు వినోద్‌కుమార్, విజయ్‌కుమార్, ఆయా జీపీల సిబ్బంది తదితరులున్నారు.

ఆలూర్‌లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ


ఆలూర్‌లో ప్రజావేదిక నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూర్ , మే 9 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కూలీల డబ్బులు ఆలస్యంగా వస్తుందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ పనుల కొలత ఆధారంగా డబ్బులు చెల్లిస్తారని కూలీలు నిబద్ధతతో సమయ పాలనతో పనిచేయాలని సూచించారు. వేతనాలు చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మొక్కల పెంపకం వాటి సంరక్షణపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి లక్ష్మీ, పంచాయితీ కార్యదర్శి రాజలింగం, తీగె నరేష్, సామాజి తనిఖీ అధికారి నరేష్, సంతోష్, కూలీలు రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,మే9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటాఖుర్దు గ్రామానికి చెందిన సాయిబాబు(23)అనే వ్యక్తి గురువారం ఉదయం చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం చెరువులో శవం తేలడంతో పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,మే9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ 33/11సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ అశోక్ తెలిపారు. మధ్యాహ్నం 4గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఈ విషయంలో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉరివేసుకుని వ్యవసాయ కూలీ మృతి

ఆర్మూర్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ శివారులో శుక్రవారం ఉరివేసుకుని బండి భిక్షపతి(65) అనే వ్యవసాయ కూలీ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సిద్దిపేట్ జిల్లా సురనిపేట్ గ్రామానికి చెందిన భిక్షపతి గత కొన్నేళ్లుగా అంకాపూర్‌లో నివాసం ఉంటూ భార్య పోసానితో కలిసి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లిన భిక్షపతి తిరిగి రాకోపోవడంతో భార్య వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా చెట్టుకు ఉరివేసుకొని ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి ఏఎస్ఐ చిన్నయ్య పోలీస్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తనకున్న అప్పుల బాధతో మనస్తాపం చెంది ఉరివేసుకున్నట్లు తెలిసింది. భార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

'పాకిస్తాన్‌కు మద్దతుగా పోస్టుపెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి'


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న యువజన సంఘాల సభ్యులు

వేల్పూర్, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టుపెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వేల్పూర్ మండల కేంద్రంలోని వివిధ యువజన సంఘాల యువకులు ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు జరిపిన దాడిలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కొందరు మరణించిన ఘటనపై పాకిస్తాన్‌కు మద్దతుగా సోషల్‌మీడియాలో పోస్టుపెట్టిన వేల్పూర్ గ్రామానికి చెందిన ఆ వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేస్తూ గ్రామంలో యువకులు ర్యాలీ నిర్వహించారు. ఇండియాలో ఉంటూ పాకిస్తాన్‌కు మద్దతుగా పోస్టుపెట్టిన వ్యక్తి పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే వేల్పూర్‌లోని జంబిహనుమాన్ ఆలయంలో పూజలు చేస్తే జరిగేది ఏముంది డబ్బులు ఖర్చు తప్ప వీటివల్ల ఒరిగేది ఏమిలేదని సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు పెట్టిన వ్యక్తిపై కూడా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని వివిధ యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో పింఛన్ల కోసం రాస్తారోకో


పొతంగల్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పింఛన్‌లు మంజూరు చేయకపోవడం సిగ్గుచేటని పొతంగల్ మండల బీజేపీ అధ్యక్షులు భజరంగ్ హన్మాండ్లు ఆరోపించారు. పొతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం కొత్త పింఛన్‌లు మంజూరు చేయాలని, పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఎంతో మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నాలుగు వేల రూపాయల పింఛన్‌లు పెంచుతామని చెప్పినా హామీ నెరవేరలేదన్నారు. కొత్త పింఛన్ల విషయంలోనూ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరికాదన్నారు. అనంతరం కొత్త పింఛన్లు మంజూరై తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మక్కయ్య, వెంకట్రావ్, అశోక్, శంకర్, లక్ష్మణ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

వీర మరణం పొందిన సైనికునికి అంతిమ వీడ్కోలు


అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు

మద్నూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలూకాకు చెందిన ఆర్మీ జవాన్ సచిన్ యాదవ్ రావ్ వనంజే జమ్మూ కశ్మీర్‌లో లోయలో పడి గురువారం వీరమ రణం పొందాడు. కాగా జవాన్ పార్థీవదేహం శుక్రవారం గ్రామానికి తీసుకరావడంతో మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లోని చుట్టు పక్కల ప్రజలు పెద్ద ఎత్తున ఆయన పార్థీవదేహాన్ని చూసేందుకు వచ్చారు. కాగా శుక్రవారం జవాన్ అంత్యక్రియలను మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంచనాలతో నిర్వహించింది. కార్యక్రమానికి సైనిక మేజర్‌తో పాటు ఎంపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

వర్గీకరణలో మాలలకు తీరని అన్యాయం

● మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చొక్కం దేవిదాస్

నవీపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఎస్సీ వర్గీకరణలో మాలలకు తీరని అన్యాయం జరిగిందని మాల మహనాడు జిల్లా అధ్యక్షులు చొక్కం దేవిదాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన మాల మహనాడు మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాలలకు 6శాతం రిజర్వేషన్ అమలులో ఉండగా ఇటీవల జరిగిన వర్గీకరణలో మాలలకు కేవలం 5శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే ప్రకారం మాలలకు 8శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. మాల మహానాడు మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌర రాజు, ఉపాధ్యక్షులుగా బత్తూరు సాయిలు, వీ.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కే.శ్యామ్, కోశాధికారిగా గైని మోహన్, సహాయ కార్యదర్శులుగా ఎల్.సుగందర్, బేగరి జనార్ధన్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్ ఎడ్ల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు సంగెం శ్రీనివాస్, బుచ్చన్న, సహాయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి భవనంపై రెడ్‌క్రాస్


రెడ్‌క్రాస్ గుర్తుపెయింటింగ్

నవీపేట,మే9(ఆంధ్రజ్యోతి): నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి భవనంపై వైద్య అధికారులు గురువారం రెడ్‌క్రాస్ గుర్తును పెయింటింగ్ వేయించారు. ఇండియా, పాకిస్తాన్ దేశాల మధ్యన యుద్ధ వాతావరణం ఏర్పడడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు ఆసుపత్రి భవనంపై ఈ రెడ్‌క్రాస్ గుర్తును పెయింటింగ్ వేయించడం జరిగిందని వైద్యాధికారులు తెలిపారు. రెడ్‌క్రాస్ గుర్తు ఉన్న భవనాలపై శత్రుదేశాలు దాడి చేయకూడదనే నిబంధన ఉండడంతో ఆసుపత్రి భవనంపై ఈ రెడ్‌క్రాస్ గుర్తును పెయింటింగ్ వేయించడం జరిగిందని వైద్యాధికారులు వివరించారు.

బాన్సువాడ డీఎస్పీగా విఠల్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

బాన్సువాడ , మే 9(ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ డీఎస్పీగా విఠల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. నల్గొండ డీటీసీలో పనిచేసి బదిలీపై ఆయన బాన్సువాడకు వచ్చారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విఠల్ రెడ్డి సీఐ, పోలీసు సిబ్బంది ఘనస్వాగతం పలికారు. కాగా ఇంతకుముందు పనిచేసిన డీఎస్పీ సత్యనారాయణ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

దేశ సైనికుల క్షేమం కోసం పూజలు

మద్నూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం తమ పొరుగు దేశంలో ఉగ్రవాద నిర్మూలన కోసం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలయాల్లో పూజలు చేశారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న సలబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మద్నూర్‌లో రథోత్సవానికి ఏర్పాట్లు

మద్నూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అనవాయితీగా నిర్వహిస్తున్న రథోత్సవ కార్యక్రమానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ ఆలయంలో ప్రతి ఏడాది బుద్ధపౌర్ణమిని పురస్కరించుకుని జరుపుకునే ఉత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈనెల 12, 13వ తేదీలలో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రథోత్సవం సందర్భంగా రథాన్ని ఊరేగించి పూజలు నిర్వహిస్తారు. కుస్తీ పోటీలు జరుగుతాయి. జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. పాత కాలం నాటి రథానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. చుట్టూ పక్కల వంద కిలో మీటర్ల దూరంలో ఇటువంటి అపురూపమైన రథం లేకపోవడంతో భారీ సంఖ్యలో భక్తులు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. ఈనెల 12న అర్ధరాత్రి, 13న సాయంత్రం రథాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండేలకు ఆహ్వాన పత్రికలను అందజేసి కార్యక్రమానికి రావాలని నిర్వాహకులు కోరినట్లు తెలిపారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


రామారెడ్డి, మే 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిందూర్ ఆపరేషన్‌లో భారతదేశం దిగ్విజయంగా విజయం సాధించాలని భక్తులు, దేవస్థాన సిబ్బంది పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగు డిలో సీనియర్ పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో సంతతధారాభిషేకం, పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై హింద్ జై జై భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహించాలి'

రామారెడ్డి, మే 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహించాలని రామారెడ్డి ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

'ఈత సరదా విషాదం కాకూడదు'

బాల్కొండ , మే 9(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో ఎంతోమంది పిల్లలు, యువకులు ఎండవేడి నుంచి సేద తీరడానికి ఈత నేర్చుకోవడానికి జలాశయాల వద్దకు వెళ్లడం ద్వారా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, ఈత సరదా కుటుంబంలో విషాదం నింపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై బి.నరేష్ ప్రజలకు సూచించారు. వేసవిసెలవుల్లో పిల్లలపై దృష్టి పెట్టాలని సూచించారు.



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన 1033 టోల్‌ఫ్రీ బోర్డు

హైవేపై సమస్యా.. 1033ని వినియోగించుకోండిలా!

పెద్దకొడప్‌గల్, మే9(ఆంధ్రజ్యోతి): సాధారణంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఏదైనా సమస్య వస్తే ఆ ప్రాంతంలో తమకు తెలిసిన వారికి ఫోన్ చేసి సాయం తీసుకుంటారు. అయితే సంబంధిత జాతీయ రహదారులపై ఏదైనా సమస్య వస్తే వారి సమస్యలను తీర్చడానికి హైవే అథారిటీ వారు ఆయా ప్రాంతాలకు సంబంధించి టోల్‌ఫ్రీ నెంబర్‌ను కేటాయిస్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భిక్కనూర్ నుంచి పోచంపాడ్ వరకు 44వ జాతీయ రహదారి, నిజాంసాగర్ మండలం బ్రహ్మణపల్లి గ్రామం నుంచి మద్నూర్ బార్డర్ వరకు 161వ జాతీయ రహదారి వెళ్తోంది. ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు అత్యవసర సమయంలో సేవలు అందించడానికి 1033 టోల్‌ఫ్రీ నెంబర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు.

1033 సేవలివీ..

జాతీయ రహదారులపై ప్రయాణం చేసే వారి వాహనంలో ఇంధనం అయిపోతే ఈ నెంబర్‌కు సమాచారం అందజేసినట్లయితే 15 నుంచి 20 నిమిషాల సమయంలో 5 లీటర్ల వరకు ఇంధనం తీసుకొచ్చి అందజేస్తారు. అయితే ఇంధనానికి సంబంధించిన డబ్బులను మాత్రం తీసుకుంటారు. దీంతో పాటుగానే వాహనం పంక్చర్ అయితే సమాచారం ఇస్తే వాహనం పంక్చర్ చేయడంలో సహాయం చేస్తారు. అంతేగాక రహదారులపై ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే అందుబాటులలోకి రావడంతోపాటు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తారు. వాహనం ప్రమాదానికి గురై రహదారిపై ఉంటే దానికి పక్కకి తొలగిస్తారు. అంతేగాక వాహనాలకు ఏదైనా సాంకేతిక సమస్య వస్తే దానిని పరిష్కరించేలా కృషి చేస్తారు. జాతీయ రహదారిపై హైవే సిబ్బంది వచ్చి అందించే సేవలు ఉచితంగా అందజేస్తారు హైవే అధికారులు.

ఢిల్లీ నుంచి పర్యవేక్షణ

జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఢిల్లీ నుంచి పర్యవేక్షిస్తారు. 24గంటల పాటు అధికారులు అందుబాటులో ఉండి ఎవరైనా ఫోన్ చేయగానే వారి నెంబర్‌కు జీపీఎస్ ద్వారా ట్రేస్ చేసి వివరాలు కనుక్కుని సంబంధిత టోల్ ప్లాజా వారికి సమాచారం అందించి సహాయం అందజేస్తారు. లేదంటే వాహనదారులు 1033కు ఫోన్ చేయగానే వారి వివరాలు ఆ రహదారి నెంబర్‌ను కనుక్కుని తక్షణమే సహాయం అందజేస్తారు. వాహనదారులకు సహాయం అందించడానికి పెట్రోలింగ్, రెస్క్యూ సిబ్బంది సేవలను వాడుకుంటారు.

రహదారులపై టోల్‌ఫ్రీ నెంబర్ల ఏర్పాటు

వాహనదారులకు అత్యవసర సమయాలలో సేవలు అందించడానికి రహదారి వెంబడి పక్కన 1033 టోల్‌ఫ్రీ నెంబర్ల బోర్డులను ఏర్పాటు చేస్తారు. అత్యవసర సమయాలలో ఎవరైనా 1033 నెంబర్‌కు ఫోన్‌చేస్తే ఆ తర్వాత 1033 కాల్‌సెంటర్ నుంచి సంబంధిత వాహనదారుడికి ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయ్యిందా లేదా అని అడిగి తెలుసుకుంటారు. సేవలు అందించినందుకు ఎవరైనా డబ్బులు తీసుకున్నారా సకాలంలో సేవలు అందించారా లేదా అని తెలుసుకుంటారు. ఈ సేవలు వాహనదారులు అందుకునేందుకు వీలుగా ప్రతీ 5 కిలోమీటర్లకు ఒక బోర్డును ఏర్పాటు చేస్తారు. వాహనదారులూ మీరు హైవేలపై ప్రయాణించే సమయంలో అత్యవసర సమయాలలో 1033 సేవలు వినియోగించుకోండి.

కల్వర్టులను బాగు చేయాలని సబ్‌కలెక్టర్‌కు వినతి

బోధన్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఐదో వార్డులో పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారిన కల్వర్టులను బాగు చేయాలని మాజీ కౌన్సిలర్ అత్తవుల్లాఖాన్‌తో పాటు కాలనీవాసులు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ అత్తవుల్లాఖాన్ మాట్లాడుతూ తమవార్డులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, ప్రస్తుతం కాలనీలో ఉన్న కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. వర్షాకాలంలో గుంతలు తెలియక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. ముందస్తుగా చర్యలు చేపట్టాలని శుక్రవారం అధికారులకు విన్నవించామన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో కాలనీని సదర్శిస్తానని, కాలనీలో ఉన్న కల్వర్టులను, గుంతలను పూడ్చివేసి కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు.

గుడి గుట్టు బహిర్గతమయ్యేనా!?

- కొన్ని రోజులుగా ఆలయంలో నిత్యం వివాదాలు
- హుండీ లెక్కింపు సమయంలో మరింత ఎక్కువైన వైనం
- స్వామివారి బంగారు ఆభరణాలు, దాతలు ఇస్తున్న డబ్బులను వెల్లడించాలని డిమాండ్



శ్రీ సిద్దరామేశ్వర ఆలయం ఇదే..



మంత్రి కొండా సురేఖను కలిసి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

భిక్కనూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర ఆలయంలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆలయంలో ఇటీవల కాలంలో అంతర్గత పోరు, నిత్యం వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఈ ఆలయానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటుగా ఉమ్మడి మెదక్, మహారాష్ట్ర, కర్ణాటకలో పెద్దఎత్తున భక్తులు వస్తుంటారు. దీంతో ఆలయానికి స్వామివారి దర్శనానికి వచ్చిన సమయంలో, బ్రహోత్సవాల సమయంలో కానీ ఉమ్మడి జిల్లాతో పాటుగా ఇతర ఉమ్మడి జిల్లాలు, రాష్ట్రాల భక్తులు పెద్దఎత్తున విరాళాలను అందజేస్తుంటారు. దీంతో పాటుగా మొక్కులు తీర్చాలని స్వామివారిని వేడుకుంటూ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో డబ్బులు, బంగారు, వెండి వస్తువులను వేస్తుంటారు. ఇదే అదునుగా ఆలయంలోని కొందరు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారు. ఇంత జరుగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్నట్లు..

ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్నట్లు గతంలో ఆలయ హుండీల్లో నుంచి అయస్కాంతం సహాయంలో డబ్బులు తీయడం, రిసిప్ట్ బుక్కుల మాయం, కొండముచ్చు మృతి, తాజాగా హుండీ లెక్కింపు సమయంలో అక్కడి సిబ్బంది కళ్లు గప్పి డబ్బులు చోరీ చేయడం, భక్తుల విరాళాలతో నిర్మించిన గదులకు అసెస్మెంట్ నెంబర్లను ఇవ్వడం, ఆలయంలో ఇలా చాలానే ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఆలయానికి భక్తులు అన్నదానానికి అందజేస్తున్న బియ్యం, దాతలు ఇచ్చే డబ్బులు మాయం చేస్తున్నారని, ఇప్పటివరకు ఆలయానికి సంబంధించిన భూములు ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల భూముంది.. ఎవరెవరి ఆధీనంలో ఉంది.. అన్నదానానికి వచ్చిన డబ్బులు ఎక్కడ జమ చేస్తున్నారు.. ఆలయ అభివృద్ధికి దాతలు ఇచ్చిన డబ్బుల వివరాలు.. స్వామివారికి ఉన్న ఆభరణాలు తదితర విషయాలను వెల్లడించాలని స్థానిక యువకులు, భక్తులు కొన్నిరోజుల క్రితం ఆలయ ఈవో శ్రీధర్‌ను లిఖిత పూర్వకంగా కోరారు. అది తమ చేతుల్లో లేదని శాఖపరమైన అంశాలను వెల్లడించడానికి తనకు అనుమతి లేదని ఈవో సమాధానం ఇచ్చారు. ఆలయ అభివృద్ధి, అన్నదానానికి వచ్చే డబ్బులు సక్రమంగా వినియోగిస్తే వాటిని బహిర్గతం చేయ్యడానికి ఏం అడడ్డొస్తుందని స్థానికులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయంలో ఇన్ని సమస్యలు, వివాదాలు జరుగుతున్న అధికారులు, ఎమ్మెల్యే కానీ పట్టించుకోవడం లేదని గుడి గుట్టు శ్రీ సిద్దరామేశ్వరస్వామికే ఎరుకని భక్తులు చర్చించుకుంటున్నారు.

చుట్టుముడుతున్న వివాదాలు

గత కొన్ని సంవత్సరాల క్రితం శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ అభివృద్ధికి అఖిలపక్ష నాయకులు ప్రత్యేక దృష్టిసారించి దాతల సహాయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఎల్లమ్మ ఆలయం వద్ద ఇరువైపులా అసంపూర్తిగా అధ్వానంగా ఉండే సర్వీసు రోడ్డుపై మొరం పోసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో సైతం భక్తుల సౌకర్యార్థం గదుల నిర్మాణం, ఆలయంలో క్యూలైన్లు, దానిపై రేకుల షెడ్డు, బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి కళ్యాణం నిర్వహించేందుకు పెద్ద షెడ్డు, మండపం ఇలా చాలానే అభివృద్ధి కార్యక్రమాలను పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. కానీ ఇటీవలి కాలంలో ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు పక్కన పెడితే ఆలయంలోచాలా వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఆలయంలో అవినీతి తారస్థాయికి చేరుకుందని, అంతర్గత పోరు నడుస్తుందని భక్తులలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల హుండీ లెక్కింపు సమయంలో డబ్బులను దొంగిలించిన వ్యక్తిపై, ఈవోపై ఏకంగా కొందరు మంత్రి కొండ సురేఖకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో నెలకొన్న వివాదాలపై దేవాదాయ శాఖ అధికారులు సైతం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.

ఆభరణాలు, డబ్బుల వివరాలు వెల్లడించాలని డిమాండ్

స్వామివారికి ఇప్పటివరకు ఉన్న అభరణాలు, దాతలు అందజేస్తున్న డబ్బుల వివరాలు, అన్నదానానికి వస్తున్న డబ్బులు, ఆలయానికి ఉన్న స్థలాలు, ఇప్పటివరకు దాత డబ్బులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించాలని ఇటీవలికాలంలో భక్తుల నుండి డిమాండ్‌లు పెరుగుతున్నాయి. గతంలో సమాచారహక్కుచట్టం జిల్లా ప్రతినిధి రవీందర్‌తో పాటుగా పలువురు ఈవోను సమాచార హక్కు చట్టం ద్వారా వాటి వివరాలను తెలపాలని కోరగా ఆలయానికి సంబంధించిన వివరాలను వెల్లడించడానికి అనుమతి లేదని చెప్పినట్లు సమాచారం. అన్ని సక్రమంగా ఉంటే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి దేవాదాయశాఖ అధికారులు ఈ వివరాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.

వేసవిలోనూ అడుగంటలే..!

డిచ్‌పల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల పెంపు కోసం సుద్దులం గ్రామ శివారులోని వాగులో నిర్మించిన చెక్‌డ్యాం నీటితో కళకళలాడుతోంది. ఇంతటి ఎండలో సైతం నీటితో చెక్‌డ్యాం జలకళను సంతరించుకునే ఉంది. చెక్‌డ్యాంలో నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోనూ బోర్లలో కూడా నీరు అడుగంటకుండా సమృద్ధిగా పోస్తున్నాయి. ఈ ఏడాది పంటలు కూడా వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రామడుగు ప్రాజెక్టు ద్వారా లోని నీటిని సాగు అవసరాల కోసం వాగులోకి తరలించడంతో చెక్‌డ్యాం కళకళలాడుతుంది.





నీటితో కళకళలాడు తున్న సుద్దులం చెక్‌డ్యాం



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

సర్వే డబ్బులు ఇచ్చేదెన్నడో?

- ఆరు నెలలైనా చెల్లించని ప్రభుత్వం
- ఆశగా ఎదురుచూస్తున్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు

ఆర్మూర్‌టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి ఆరు నెలలైనా ఆ విధులు నిర్వహించిన సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, డాటాఎంట్రీ ఆపరేటర్లకు వేతనాలు అందలేదు. గత సంవత్సరం నంవంబర్ 9 నుంచి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుంటు సర్వేను చేపట్టింది. వెనుకబడిన తరగతులా కులాలకు చెందిన రిజర్వేషన్లను పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేశారు. కుటుంబ ఆర్థిక, విద్య, ఉపాధి, సామాజిక స్థితిగతులతో సహా 70 అంశాలను సర్వే పత్రాలలో ఎన్యూమరేటర్లు పొందుపర్చిన ఒక్కో ఎన్యూమరేటర్ వంద కుటుంబాలు సర్వే చేయగా సూర్ వైజర్లు వారికి కావాల్సిన సర్వే పత్రాలు అందజేస్తు వారి పనితీరుని పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో సుమారు 21వేల కుటుంబాలను 180 మంది ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహించగా 14 మంది సూపర్‌వైజర్లు 20 రోజుల పాటు విధులు నిర్వహించారు. సర్వే అనంతరం 128మది డాటాఎంట్రీ ఆపరేటర్లు వివరాలను కంప్యూటర్‌లో పొందుపర్చారు. ఒక్కో సూపర్‌వైజర్‌కు రూ.13వేలు, ఎన్యూమారేటర్‌కు రూ.10వేలు, డాటాఎంట్రీ ఆపరేటర్లకు రోజుకు రూ.750 చొప్పున నిర్ణయించారు. అయితే ఆరు నెలలైనా వేతనాలు అందకపోవడంతో విధులు నిర్వహించిన వారు మున్సిపల్ చుట్టూ తిరుగుతూ వెళ్తున్నారు. చేసిన పనికి డబ్బులు రాకపోగా ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. దీంతో విధులు నిర్వహించిన పలువురు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆరునెలలైనా డబ్బులు రాకపోవడం అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదని ఇప్పటికైనా ఉన్నత అధికారులు వేతనాలు వచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ఆలయాల్లో పూజలు

- భారత సైన్యం క్షేమం కోరుతూ జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- నీలకంఠేశ్వరాలయంలో పూజలు చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



గోల్‌హన్మాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్థులు

నిజామాబాద్ కల్చరల్, మే9 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం క్షేమం కోరుతూ జిల్లాకేంద్రంలోని నీలకంఠేశ్వరాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాకిస్థాన్‌పై యుద్ధంలో భారత్ పైచేయి సాధిస్తుందని ఇప్పటికే పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రస్తావరాలను భారత త్రివిధ దళాలు ధ్వంసం చేశాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయంలో ఆపరేషన్ సిందూర్ కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రోచ్ఛరణలో నిర్వహించిన పూజాది కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. భారత సైన్యం పేర్లతో శివునికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాశ్మీర్‌లో పహల్గాం ఘటన తర్వాత ప్రతీ భారతీయుడిలో ఆవేదన, ప్రతీకారంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌పై భారత సైన్యం పోరాడాలని గట్టిగా భావించారని, అందుకు తగినట్టుగా ప్రధాని నరేంద్రమోదీ ఆపరేషన్ సిందూర్ పేరిట ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం మెరుపు దాడులు నిర్వహిస్తోందని అన్నారు. జైషేమహ్మద్, లష్కరే తోయిబా లాంటి ఉగ్రస్థావరాలపై భారత సైన్యం దాడి చేసి దాదాపు వందమంది ఉగ్రవాదులను అంతమొందించిందని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ భారత్ చర్యను భరించలేక భారతదేశంపైనా, మన పౌరులపైన దాడులకు పాల్పడుతోందని అన్నారు. భారత త్రివిధ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని అన్నారు. ప్రపంచ దేశాలు సైతం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు మద్దతు ఇస్తున్నాయని అన్నారు. పాక్-భారత్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని మోదీ, రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాలతో ఎప్పటికప్పుడు సమావేశం జరుపుతూ పాకిస్థాన్ కవ్వింపు చర్యలను తిప్పికొడుతున్నారని అన్నారు. భారత శత్రుదేశాలు మనవైపు కన్నెత్తి చూడాలన్నా ఇక్కడ ఉన్న ఒక్క భారతీయుడిని ముట్టుకోవాలన్నా ఇది ఒక్క మోదీ హెచ్చరిక అని అన్నారు. భారతసైన్యం తలచుకుంటే పాకిస్థాన్‌ను ప్రపంచ పటంలో లేకుండా చేస్తుందని అన్నారు. దేశ ప్రజలందరూ మోదీకి, కేంద్రప్రభుత్వానికి అండగా ఉండడం గొప్ప పరిణామమని అన్నారు. పాకిస్థాన్‌పై భారత్ గణవిజయం సాధించి ఉగ్రవాదులను నెత్తుటితో భారతమాతకు వీరతిలకం దిద్దడమే ఆపరేషన్ సిందూర్ అని అన్నారు. కొంతమంది పనిగట్టుకుని అర్బన్ నక్సలైట్లు ఆపరేషన్ సిందూర్‌ను అవమానించేలా మాట్లాడుతున్నారని, వారికి సమాధానం ఇస్తూఉగ్రవాదాన్ని పెంచిపోషించి పాకిస్థాన్‌కు జీ హుజూర్ అనడానికి కేంద్రంలో అధికారంలో ఉన్నది బలమైన బీజేపీ అని అన్నారు. భారత సైన్యానికి భగవంతుడియొక్క ఆశీస్సులు ఉండాలని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యుద్ధంలో భారత సైన్యానికి, భారత భూబాగానికి దేశప్రజలకు ఎటువంటి నష్టం జరగకూడదని మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ప్రత్యేక పూజలు

ఆపరేషన్ సిందూర్‌లో ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని గోల్‌హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయధర్మాదాయ శాఖ ఆదేశానుసారం ఉమ్మడి జిల్లా పరిధిలో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలైన జెండా బాలాజీ మందిరం, శంభులింగేశ్వర ఆలయం, మాధవనగర్ సాయిబాబా ఆలయం, హమాల్‌వాడి సంతోషి సాయిబాబా, జన్కంపేట్ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, భీమ్‌గల్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, బోధన్ ఏకచక్రేశ్వరాలయం, మారుతి ఆలయం, సలాబత్‌పూర్ హన్మాన్ దేవాలయం, పోచంపాడ్ రామలింగేశ్వరాలయం, రామాలయం, డిచ్‌పల్లి ఖిల్లారామాలయం, ఆర్మూర్‌లోని దుండి హన్మాన్ ఆలయం, ఇందల్వాయి రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గోల్‌హన్మాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు భాగస్వామ్యమై భారత సైన్యానికి భగవంతుడు అండగా నిలవాలని వేడుకుంటూ పూజించారు. భక్తుల అంజనేయ స్వామి నామస్మరణతోపాటు భారత్ మాతాకీ జై, భారత్ జవాన్ కీ జై అంటూ నినాదాలతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజు జోషి, కార్యనిర్వాహణ అధికారి రవీందర్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలలకు మద్దతుగా ఆలయాల్లో పూజలు

డిచ్‌పల్లి: భారత్-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో భారత్ త్రివిధ దళాలలకు అంతా మంచి జరగాలని, సైన్యానికి, ప్రజలకు ఎటువంటి హానీ జరగవద్దని కోరుతూ గ్రామస్థులు ధర్మారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలుచేశారు. భారత్ దాడులతో ఇప్పటికే దాయాది దేశానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని అన్నారు. పహల్గమ్ మృతులకు, ఇదినిజమైన నివాళి అని గ్రామస్థులు పేర్కొన్నారు. దేశ ప్రధాని మోదీ సారథ్యంలో దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం, వేంకటేశ్వర ఆలయం బెటాలియన్‌లలో పోలీసు కుటుంబాలు ప్రత్యేక పూజలు చేశారు.

బోధన్‌లో మారుతి మందిరంలో..

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా కోసం శక్తిపూజ నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ జరుపుతున్న భారతదేశ జవాన్‌ల ధైర్య సాహసాలు, మనో ధైర్యాన్ని కల్పించాలని ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మారుతీ మందిరంలో భారత జవాన్లకు మరింత ధైర్యాన్ని కలిగించుటకై ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పథకాల అమలుకు నేతల పట్టు!

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. ఈ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ రెండుగా చీలడంతో అధికారులకు తిప్పలు తప్పడం లేదు. మండలాల పరిధిలో అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల ఎక్కువ కావడం వల్ల కొంతమేర ఇబ్బంది పడుతున్నామని మండల స్థాయి అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే పనిచేసే అవకాశం లేదని వారు వివరించారు. రెండు పక్షాల నుంచి ఒత్తిళ్ల పెరిగిన తప్పనిసరి పరిస్థితుల్లో పనులు కొనసాగిస్తున్నామని వారు వివరించారు. అధికార ప్రతిపక్ష పార్టీల నేతల ఒత్తిళ్ల మధ్య అభివృద్ధే ధ్యేయంగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లా అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేస్తే అధికారులకు ఇబ్బందులు తప్పే అవకాశం ఉంది.

హింసకు తావులేదు

(5వ పేజీ తరువాయి)

మంత్రితో పాటు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ పాల్గొని ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ములుగు జిల్లా కర్రెగుట్టలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మృతి చెందారని, అందులో పాల్వంచకు చెందిన కానిస్టేబుల్ శ్రీధర్ కూడా ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను అందిస్తామన్నారు. ఇటువంటి సంఘటనలు సహించేది లేదన్నారు. మావోయిస్టులు సైతం శాంతి చర్చలు అని ప్రకటించారని, కాల్పుల విరమణ ప్రకటించారని అన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వంతో సీఎం రేవంత్‌రెడ్డి శాంతి చర్చలు జరపడానికి చొరవ చూపుతున్నారన్నారు. చర్చల కోసం జానారెడ్డి, కేశవరావును నియమించినట్లు తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా శాంతి భద్రతలను కాపాడుకోవాలని, ప్రాణాలు కోల్పోతే ఏమి వచ్చేది లేదన్నారు. ఏదైనా చట్టపరంగా, న్యాయపరంగా చర్చించుకోవాలని దాని ప్రకారమే నడుచుకోవాలని అన్నారు. శ్రీధర్ కుటుంబానికి రూ.2.17కోట్ల పరిహారం తో పాటుగా 300 గజాల ప్రభుత్వ స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మంత్రి పొన్నం తెలిపారు. శ్రీధర్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ మేరకు శ్రీధర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం శ్రీధర్ అంత్యక్రియలను అశ్రునయనాల మధ్య నిర్వహించారు. కాగా శ్రీధర్ అంత్యక్రియలకు ప్రజలు, యువకులు, పోలీసు అధికారులు పెద్దఎత్తున పాల్గొని ఘన నివాళులు అర్పించారు. అంతిమ యాత్రలో గ్రేహౌండ్స్ కమాండ్ ఆపరేషన్ రాఘవేందర్‌రెడ్డి, ఓఎస్డీ దయానంద్, ఎస్పీ చైతన్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతులు నిల్.. ఫీజులు ఫుల్!

(5వ పేజీ తరువాయి)

సొంత భవనాలు లేకపోగా అరకొర వస తుల మధ్యే నిర్వహిస్తున్నారు. వసతులు అంతంత మాత్రమే ఉన్నా ఫీజుల మాత్రం లక్షల్లో వసూలు చేస్తున్నా ప్రైవేట్ కళాశాలలపై అధికారులు చర్యలు వెనుకాడుతుండడం విమర్శలకు తావిస్తోంది. అలాగే జిల్లాలోని ప్రైవేటు కళాశాలలు ఒకే ర్యాంకును అనేక కళాశాలలు తమకు వచ్చినట్టుగా ప్రచారం చేసుకోవడంతో పాటు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర బ్రాంచ్‌లలో వచ్చిన ర్యాంకులను కూడా తమవే అంటూ ప్రచారం చేసుకుంటున్నాయి. ఇతర బ్రాంచ్‌లలో చదివించి పరీక్షలు మాత్రం ఇక్కడి నుంచి రాయించి ర్యాంకులు వస్తే తమ కళాశాలలోనే చదివినట్టు చూపెడుతూ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు

● రవికుమార్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి



జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్‌లో ఫీజుల పెంపును పర్యవేక్షిస్తాం. కళాశాలలపై ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

నెట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

సుభాష్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సబ్‌జూనియర్ నెట్‌బాల్ బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, రమేష్‌లు తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహిం చినట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మే 15వ తేదీ నుంచి 18వరకు వరంగల్ జిల్లా జనగామలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగింది. సుమారు వంద మందికి పైగా క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. ఈ ఎంపికల కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్, నాగరాజ్, రమేష్ గౌడ్, కుమార్, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో యశ్వంత్, సామ్రాట్, మణితేజ, వరుణ్ తేజ్, భువన్ తేజ్, భరత్ కుమార్, అమర్, మహేష్, నితిన్, సంప్, సుహాన్, స్టాండ్‌బైగా శేఖర్, స్వరాజ్ గౌడ్, సాత్విక్, నితిన్‌లు ఉన్నారు.బాలికల విభాగంలో నయన, అక్షయ, సింధు, మహిమ, నందిని, హర్షిత, నేహ, మురాళిని, అక్షయ, గాయత్రి, మేఘన, స్టాండ్‌బైగా గీత, మహేశ్వరి, శృతి, సంధ్య, వైష్ణవిలు ఉన్నారు.

పట్టణ పద్మశాలీ సంఘం ఎన్నికలకు నామినేషన్ల దాఖలు



నామినేషన్లు వేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలకు నామినేషన్లను దాఖ లు చేశారు. నగరంలోని శుక్రవారం మార్కండేయ మందిరంలో శుక్రవారం కొండలక్ష్మణ్ బాపూజీ అభి వృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల అధికారిగా అడ్వకే ట్ గంగప్రసాద్‌ను నియమించారు. ఈనెల 11వరకు నామినేషన్ ప్రక్రి య కొనసాగనుంది. మే 25న పద్మశాలి ఉన్నత పాఠశాలలో ఎన్నికలు జరగనున్నాయి. కొండలక్ష్మణ్ బాపూజీ అభివృద్ధి కమిటీ ప్యానల్‌లో అధ్య క్షులుగా పెంటం దత్తాద్రి, ప్రధాన కార్యదర్శిగా చౌటి భూమేష్, ఉపాధ్య క్షులుగా భీమర్తి రవి, కన్న దుబ్బరాజ్యం, బాగుల శ్రీనివాస్, సహా య కార్యదర్శులుగా వీజీ ప్రసాద్, బూస రవి, ఎనుగందుల సుభాష్, కోశాధికారిగా మోరసాయిలు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కస్తూరి గంగరాజు, ప్రచార కార్యదర్శి బూస శ్రీనివాస్, నామినేషన్లను దాఖలు చేశారు. కార్య క్రమంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకులు ఎస్ఆర్ సత్యపాల్, అమృ తాహూర్ గంగాధర్, బిల్ల మహేష్, మదన్‌మోహన్ గణేష్ పాల్గొన్నారు.

హెల్మెట్ బరువు కాదు.. బాధ్యతగా భావించాలి



కళాజాతా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిరికొండ ఎస్సై ఎల్.రామ్

సిరికొండ, మే 9 (ఆంధ్రజ్యోతి) వాహనచోదకులు హెల్మెట్ బరువుగా బావించకుండా ఒక బాధ్యతగా బావించాలని సిరికొండ ఎస్సై ఎల్.రామ్ వాహనాలను డ్రైవింగ్ చేసే వారిని కోరారు. సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన పోలీస్ కళాజాతా కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. అంతకు ముందు కళాకారులు వివిధ అంశాలపై ప్రజలకు అర్థమయ్యే విధంగా పాటలు పాడారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు పై ద్విచక్ర వాహనాలను డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్‌ను బరువుగా బావించకుండా అది తమ బాధ్యతగా బావించాలని కోరారు. ప్రమాదాలు జరిగిన సమయంలో మన ప్రాణాలకు ప్రమాదం ఉండదన్నారు. మనం జీవించడంతో పాటు తోటి ప్రయాణికులకు జీవించేలా సహకరించడం కూడా బాధ్యత అని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం షీ టీమ్‌లను ఏర్పాటు చేసిందని చెప్పారు. మహిళలు షీం టీంలను ఉపయోగించుకోవాలని ఎస్సై కోరారు. ఎక్కడైన ఏమైన ఇబ్బందుల్లో ఉంటే మహిళలు 871265795 నెంబర్‌కు కాల్ చేయవచ్చని ఎస్సై చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయాల్ చేసి సమస్యను చెప్పుకోవడం వల్ల సమస్యకు పరిష్కారం లబిస్తుందని ఎస్సై రామ్ చెప్పారు. చోరీలను నిరోధించుకోవడానికి సీసీ టీవీలను గ్రామాల్లో ఏర్పాటు చేయించుకోవాలని ఎస్సై ఈ సందర్భంగా కోరారు. ఎవరూ ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని, వాటిపై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ఒకవేళ మోసం జరిగితే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

వీర సైనికుడికి నివాళి



నివాళి అర్పిస్తున్న ప్రజలు

ధర్పల్లి : మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందినజవాన్ మురళీ నాయక్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. మండల బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాక్ సరిహద్దుల్లో విధుల్లో ఉండగా పాక్ చొరబాటు దారులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన మురళీ నాయక్‌కు ఘన నివాళులు అర్పించారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మురళీ నాయక్ దేశ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటాడని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరుడా నీకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి ఎచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని వినతి



జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్ : వేసవి సెలవుల్లో నిర్వహించే ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక స్థాయి ప్రధానోపాధ్యాయులకు జిల్లా స్థాయిలో పీజీ ఎచ్‌ఎంలకు నిర్వహించే విధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని, నూతన విద్యా సంవత్సరంలో నిర్వహించే కాంప్లెక్స్ సమావేశాల్లో పీఎస్ ఎచ్‌ఎంలకు కార్యదర్శి హోదా ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారికి పీఎస్ ఎచ్‌ఎం అసోసియేషన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో పర్యవేక్షణ కోసం అన్ని అర్హతలు ఉన్న పీఎస్ ఎచ్‌ఎంలకు మండల నోడల్ అధికారులుగా నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ ఎచ్‌ఎంలు రచ్చ మురళి, ప్రశాంత్ రెడ్డి, సురేష్ రెడ్డి, నరేష్, సందీప్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

నవీపేట,మే9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఎంఈవో అశోక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి, విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరంలో సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ ఈ నెల 25వరకు కొనసాగనుందని ఎంఈవో వివరించారు.

ముప్కాల్ : మండలంలోని శనివారం నుంచి 25వ తేదీ వరకు ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈవో జక్కుల రవి తెలిపారు. సమ్మర్ క్యాంపులో డ్రాయింగ్, డ్యాన్స్, సంగీతం, యోగా తదితర విషయాలపై ఉదయం 8 గంటల నుంచి 11 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోస్రా : చందూర్, మోస్రా మండలాల్లోని నాలుగో తరగతి నుంచి పదవతరగతి చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఎండకాలం శిక్షణ తరగతులు ప్రారంభం అవుతున్నాయని మండల విద్యాశాఖ అభివృద్ధి అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ ఆదేశానుసారము మండలంలో తేది 10-5-25నుండి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల మోస్రా, చందూర్‌లలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నది. ఈ సెలవుల యందు విద్యార్థులు ప్రత్యేక శిక్షణలో పాల్గొని వివిధకళల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

బైక్ చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడితో పోలీసులు

నిజామాబాద్ అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): బైక్‌చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగి అయిన మొహిముద్దీన్ (56), పెర్కిట్‌కు చెందినవ్యక్తి. నిజామాబాద్ జిల్లాకు కొడుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో బుధవారం రాత్రి 8 గంటలకు ప్యాషన్‌బైక్‌పై వచ్చి ప్రగతిఆస్పటిల్ ఎదురుగా పార్క్ చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు చూడగా బండి కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం బోధన్ బస్టాండ్‌లో పోలీసులు తనిఖీ చేయగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులు మజద్‌ను విచారించగా బైక్‌లు చోరీచేసినట్లు తేలింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

వేసవిలో ప్రభుత్వ ఉచిత శిక్షణ తరగతులు

డిచ్‌పల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ రెసిడె న్షియల్, కేజీబీవీ, మోడల్‌స్కూల్ పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 9 వరకు చదివే విద్యార్థులకు పలు విభాగాల్లో నృత్యం, సంగీతం, ఆర్ట్స్ అం డ్ క్రాఫ్ట్ శిక్షణ తరగతులు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వ హిస్తామని ఆసక్తి గల వారు ఈ నెల 12 వ తేది శిక్షణ తరగతులు ప్రారంభమై 26వతేదీలో ముగుస్తాయని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలి పారు. శిక్షణ తరగతులు తహసీల్దార్ కార్యాలయం వెనుక గల మానవత సదన్‌లో నిర్వహిస్తామని ఎంఈవో తెలిపారు. 15రోజుల పాటు విద్యా ర్థులు క్యాంపులో పాల్గొని వివిధ రంగాలలో శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల

భీమ్‌గల్ రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర కోఆ పరేటీవ్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరామ ర్శించారు. బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు ఆకుల గణేష్ నానమ్మ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాబాపూర్‌లో గోవర్ధన్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పలు గ్రామాల్లో తేలిక పాటి వర్షం

నవీపేట,మే9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. తేలిక పాటి వర్షం కురియడంతో పలు గ్రామాల్లోని రోడ్ల పక్కన ఆరబోసిన ధాన్యం స్వల్పంగా తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

లూపస్ డే సందర్భంగా నేడు 2కే రన్



మాట్లాడుతున్న వైద్యురాలు గ్రీష్మ, రవి కిరణ్

నిజామాబాద్ అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి)፡ వరల్డ్ లూపస్ డే సందర్భంగా వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ రుమటాలజీ, ఆర్థరైటిస్ సెంటర్ వైద్యురాలు గ్రీష్మ, ప్రముఖ కార్డియాలజిస్ట్ రవి కిరణ్ తెలిపారు. నగరంలోని నిజామాబాద్ రుమటాలజీ, ఆర్థరైటీస్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. కీళ్ళ వాతం(ఆర్థరైటిస్)లో లూపస్ అనేది ప్రమాదకరమైనదని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లూపస్ అనేది ప్రాణాంతకమైనది కాకున్నప్పటికీ రోగ నిరోధక శక్తిని దెబ్బ తీస్తుందని, పర్యవసానంగా అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. లూపస్ అనేది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి అని, ఈ వ్యాధి బారిన పడిన వారిలో దీర్ఘకాలిక జ్వరం, కారణం లేకుండా జ్వరం రావడం, రక్తహీనత, శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గుతుందని, అలసట, ముఖంపై దద్దుర్లు వంటి తదితర లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి ఎక్కువగా 15 ఏళ్ల నుంచి 40 వయస్సు ఉన్న ఆడవారిలో కనిపిస్తుందన్నారు. 2కే రన్‌కు ముఖ్య అతిథులుగా ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్, సెక్రటరీ విక్రమ్ రెడ్డి, ట్రెజరర్ రాజేంధర్, వైద్యులు హాజరవుతారని, నగర ప్రముఖులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

● **రుమటాలజిస్ట్‌ను కలవాల్సిందే..**

దీర్ఘకాంగా కీళ్ళ నొప్పులు, జ్వరంతో బాధపడుతున్న వారు, యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్నవారు, రుమటాయిడ్, సోరియాటిక్, ఇదివరకు ఆర్థరైటిస్‌కు చికిత్స పొందినవారు రుమటాలజిస్ట్‌ను కలవాల్సిందేనని వైద్యురాలు గ్రీష్మ తెలిపారు. ఎముకలు, నరాల డాక్టర్లు ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సు చేసిన వారు రుమటాలజిస్ట్‌లు కారని స్పష్టం చేశారు. ఎండీ జనరల్ మెడిసిన్(ఫిజీషియన్) పూర్తి చేసి మూడేళ్ల డీఎం సూపర్‌స్పెషాలిటీ పూర్తి చేసిన వారు మాత్రమే రుమటాలజిస్ట్‌లని గ్రీష్మ అన్నారు.



మీ సేవా కేంద్రాల సమస్యలను పరిష్కరించాలని వినతి



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి పుష్ప గుచ్ఛం అందిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మీసేవా కేంద్రాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మీ సేవా ఆపరేటర్ అసోసియేషన్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శుక్రవారం రాష్ట్ర కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి మీ సేవా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు జీవన్ ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.నారాయణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మహమ్మద్ నాసీర్ అహ్మద్, జిల్లా కమిటీ మెంబర్ చింత రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కిరణ్, రాష్ట్ర ట్రెజరర్ జి. శ్రీకాంత్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సాగర్ బాబు, సిఎచ్ వేణు ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్,మే9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనాధ, పాక్షిక అనాధ మహిళా అభ్యర్థుల నుంచి పలు డిప్లోమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి యస్.కే. రసూల్ బీ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో పలు డిప్లోమా కోర్సులను అందిస్తున్న నేపథ్యంలో అర్హులైన అనాధ, పేద మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లోమా కోర్సులు చేసేందుకు 60 సీట్లు ఉన్నాయని, వాటిల్లో అనాథలు, నిరాశ్రయులు అయిన అమ్మాయిలు, వసతి గృహాలలో వసతి పొందుతున్న యువతులు, అక్రమ రవాణాకు గురైన అమ్మాయిల కోసం 70 శాతం చొప్పున ఒక్కో కోర్సులో 42 సీట్లు కేటాయించినట్లు వివరించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ నియమం ప్రకారం మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు వెల్లడించారు. తెలంగాణ పాలిసెట్ పరీక్ష రాయకపోయినా పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే నెల 19 లోపు కుల, ఆదాయ, తల్లిదండ్రులు మరణించిన ధృవీకరణ పత్రము, బోనాఫైడ్, టీసీ, స్టడీ సర్టిఫికేట్‌లు, టెన్త్ మెమోను జత చేసి డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ రూంనం.17లో సమర్పించాలని తెలిపారు.

ఆర్థికమాంద్యం ఏర్పడినప్పుడు సమస్యలు పెరుగుతాయి



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు సమస్యలు పెరుగుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సోవియట్ రష్యా ఎర్రసైన్యం హిట్లర్‌ను ఓడించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి వర్గసభ్యురాలు నూర్జహాన్, శంకర్‌గౌడ్, సుజాత, నన్నేసాబ్, సురేష్, సిర్ప లింగం, నర్సయ్య, అనిత, శంశోద్దిన్, దినేష్, శేఖర్‌గౌడ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'వ్యతిరేకతను జీర్ణించుకోలేకే ఎమ్మెల్యేపై అరోపణలు'



మాట్లాడుతున్న నాయకులు

కమ్మర్‌పల్లి, మే 9:(ఆంధ్రజ్యోతి) ఎన్నికల్లో ఇచ్చిన హమీలను బుట్ట దాఖలు చేమడంతో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను జీర్ణించుకోలేకనే బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. శుక్రవారం మండ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు ఎన్నికల్లో ఇచ్చిన హమీలు అమలుకాక రోజురోజుకు ప్రభుత్వం పట్ల, వారి పాలన పట్ల వ్యతిరేకత పెరుగుతు వస్తుందన్నారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నిరంగాలలో అభివృద్ధి చేశాలని అన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. ప్రజలకిచ్చిన హమీలపట్ల అమలుకు నిలదీతలు తప్పవన్నారు. సమావేశంలో నాయకులు గడ్డం స్వామి, కుంట ప్రతాప్ రెడ్డి, గోపిడి లింగారెడ్డి, బద్దం రాజశేఖర్ (బద్రి), కేకే నరందర్, పాలెపు కిరణ్, నోముల నరేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.